

ఆగని మరణాలు

- భోగాపురంలో కిడ్నీ వ్యాధితో మరొకరి మృతి
- పదేళ్లలో 16 మంది మృత్యువాత
- అధిక సంఖ్యలో బాధితులు
- తాగునీటి వల్లే వ్యాధి బారిన పడుతున్నారని తెలిసినా పట్టించుకోని అధికారులు

- వార్త 7వ పేజీలో..

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఓ అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి

- పదుల సంఖ్యలో అస్వస్థత
- బాధితులను ఆస్పత్రికి తరలించకుండా ఇళ్లకు పంపేసిన నిర్వాహకుడు
- నర్సీపట్నం, డౌనూరు, విశాఖ కేజీహెచ్‌లలో చికిత్స
- కొందరి పరిస్థితి విషమం


మృతిచెందిన గెమ్మెలి భవానీ (ఫైల్ ఫొటో)


మృతి చెందిన కొర్ర సాధ


మృతి చెందిన జాషువా


నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలలు


నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి/కోటవురట్ల/ నర్సీపట్నం, ఆగస్టు 19: జిల్లాలోని కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ అనాథాశ్రమ నిర్వాహకుడి నిర్లక్ష్యం ముగ్గురు విద్యార్థులను బలిగొంది. మరో 42 మంది అస్వస్థతకు గురయ్యేలా చేసింది. బాధిత విద్యార్థులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, కొయ్యూరు మండలం డౌనూరు, రాజేంద్రపాలెం ఆరోగ్య కేంద్రాలు, విశాఖపట్నం కేజీహెచ్‌లలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఆస్పత్రుల్లో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు విచార వదనంతో పడిగాపులు కాస్తున్నారు.

సకాలంలో వైద్యం అంది ఉంటే..

కలుషిత ఆహారం తిని శనివారం అస్వస్థతకు గురైన విద్యార్థులను వెంటనే ఆస్పత్రిలో చేర్పించి ఉంటే ముగ్గురు చనిపోయే పరిస్థితి ఉండేది కాదని ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. పిల్లలకు ఆరోగ్యం బాగా లేదని తల్లిదండ్రులకు ఫోన్లు చేసి గిరిజన గ్రామాలకు నిర్వాహకుడు పంపించేశాడని, ఇంటికి ... మిగతా 6వ పేజీలో

ఆశల దీపాలు ఆరిపోయాయి

ఆదివాసీ పిల్లల ప్రాణాల మీదకు తెచ్చిన పాస్టర్ నిర్లక్ష్యం

చింతపల్లి, ఆగస్టు 19:


పాస్టర్ కిరణ్‌కుమార్

ఉచితంగా భోజనం పెట్టడంతోపాటు వసతి కల్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దుతానని ఓ పాస్టర్ చెప్పిన మాటలను వారు విశ్వసించారు. చదువుకుంటే కనీసం పిల్లల జీవితాలైనా బాగుంటాయని ఆశపడ్డారు. అభంశుభం తెలియని తమ బిడ్డలను పాస్టర్ వెంట పంపించారు. అయితే ఆ పాస్టర్ నిర్లక్ష్యం పిల్లల ప్రాణాల మీదకు తెచ్చింది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివాసీలు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. రెక్కాడితేనే గానీ డొక్కాడని పరిస్థితి. కుటుంబంలో పిల్లల సంఖ్య కూడా అధికంగా ఉంటుంది. కుటుంబ సభ్యులందరికీ ఆహారం అందించడం కష్టమే. గతంలో ఆదివాసీ పిల్లలు విద్యకు దూరంగా ఉండేవారు. కొంత కాలంగా తమ పిల్లలు చదువుకోవాలని ఆదివాసీలు ఆశిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి చదివిస్తున్నారు. ఇటువంటి తరుణంలో పొరుగునున్న అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామానికి చెందిన పాస్టర్ కిరణ్‌కుమార్ తాను అనాథాశ్రమం పెట్టానని, ఉచితంగా చదువు చెప్పిస్తానని, భోజన, వసతితో పాటు దుస్తులు, ఇతర అవసరాలన్నీ తానే చూసుకుంటానని చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. దాంతో మంచి విద్యతో పాటు ప్రతిరోజు మంచి భోజనం అందుతుందని పిల్లలను అతని వెంట పంపించారు.

ఏ లోటూ ఉండదనుకున్న ఆదివాసీలు..

గిరిజన ప్రాంతంలో 40 శాతం మంది ఆదివాసీలు క్రైస్తవ మతం స్వీకరించారు. దాంతో పాస్టర్ కిరణ్‌కుమార్ చెప్పిన మాటలను సులభంగా నమ్మేశారు. పాస్టర్ ఆశ్రమంలో చేర్పుకున్న విద్యార్థులందరూ క్రైస్తవులే. ఆశ్రమాన్ని ... మిగతా 6వ పేజీలో

ఇలా జరుగుతుందని ఊహించలేదు...

- బాగా చదివిస్తారన్న ఉద్దేశంతోనే ఆశ్రమంలో చేర్పించాం
- అస్వస్థతకు గురైతే ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా ఇంటికి పంపేయడం దారుణం
- చిన్నారులు కడుపునొప్పితో విలవిల్లాడారు
- కైలాసపట్నం ఘటనలో బాధితులైన చిన్నారుల తల్లిదండ్రుల ఆవేదన

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): "మంచిగా చదువుకుంటే పిల్లలు జీవితాలు బాగుంటాయని భావించాం. ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు. ఆదివారం ఉదయం ఆశ్రమం నుంచి ఫోన్ చేసి పిల్లలకు బాలేదు. అర్జంటుగా వచ్చి తీసుకువెళ్లమన్నారు. ఏం జరిగిందో కూడా తెలియదు"... అంటూ కైలాసపట్నం ఘటనలో బాధితులైన చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.


కేజీహెచ్‌లో బాధితులైన చిన్నారులతో తల్లిదండ్రులు

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తీసుకోవడంతో అస్వస్థతకు గురైన 14 మంది పిల్లలను సోమవారం కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడగా కన్నీటి పర్యంతమవుతూ బాధను వెళ్లబోసుకున్నారు. తమ బిడ్డల జీవితాలు బాగుంటాయని పంపించామని, ఇలా ఆస్పత్రి పాలవుతారని ఊహించలేదంటూ వాపోయారు. సుశాంత్ అనే బాలుడి తల్లి గుణమ్మ మాట్లాడుతూ రెండేళ్ల కిందట బాబును ఆశ్రమంలో చేర్పించానని, ఏడాదిలో రెండుసార్లు ఇంటికి వస్తాడన్నారు. ఆదివారం ఉదయం ఫోన్ చేసి ఆరోగ్యం బాలేదని, అర్జెంటుగా తీసుకువెళ్లమన్నారన్నారు. వాంతులు, విరేచనాలు చేసుకుంటూ బాబు విలవిల్లాడాడని, ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందినట్టు వివరించారు. మరో విద్యార్థి నవీన్ తల్లి మాట్లాడుతూ శనివారం రాత్రి బిర్యానీ తిన్న కొద్దిసేపటి నుంచే విరేచనాలు, వాంతులు అయినట్టు బాబు చెప్పాడన్నారు. ఆశ్రమం నుంచి బాబుకు బాగాలేదని చెబితే హుటాహుటిన వెళ్లామని, వాంతులు ఎక్కువ అవుతుండడంతో చింతపల్లి, నర్సీపట్నం ఆస్పత్రులకు తీసుకువెళ్లి... అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకువచ్చినట్టు తెలిపారు. మరో చిన్నారి మీరా తండ్రి పి.సుబ్బారావు మాట్లాడుతూ ఆశ్రమంలో ఉచితంగా భోజనం, వసతి సదుపాయం కల్పిస్తున్నామని చెబితే పాపను ... మిగతా 6వ పేజీలో

అనధికార అనాథాశ్రమాలెన్నో!

- జిల్లాలో కేవలం ఐదు ఆశ్రమాలకు మాత్రమే ప్రభుత్వ అనుమతి
- కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఘటనతో సర్వత్రా చర్చ
- వివరాలు సేకరిస్తున్నామంటున్న అధికారులు


కైలాసపట్నంలోని అనాథాశ్రమం

అనకాపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనధికార అనాథాశ్రమాలు, హాస్టళ్లు చాలా ఉన్నాయి. కేవలం ఐదు మాత్రమే ప్రభుత్వ అనుమతి పొందాయి. తాజాగా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో అనాథాశ్రమం పేరిట నిర్వహిస్తున్న హాస్టల్‌లో కలుషిత ఆహారం కారణంగా ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం, 42 మంది అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. కశింకోట, నర్సీపట్నంలలో రెండు అనాథ ఆశ్రమాలు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా నడుస్తున్నాయి. మాకవరపాలెంలో ఇమ్మానుయేలు అనే సంస్థ ఆధ్వర్యంలో బాలురు, బాలికలకు వేర్వేరుగా రెండు ఆశ్రమాలు, కొండకర్ల ఆవలో బాలబాలికల కోసం ఒక ఆశ్రమం నడుస్తున్నాయి. వీటికి మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉంది. జిల్లాలో మరే అనాథాశ్రమాలు, ప్రైవేటు వసతి గృహాలకు అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారు. అయితే ఇంతవరకు వాటిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్న ప్రశ్న తలెత్తుతోంది. కాగా కోటవురట్ల మండలం కైలాసపట్నం అనాథాశ్రమంలో సంఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో బాల బాలికల సంరక్షణ పేరుతో స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు ఎంత మంది విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తున్నారనే వివరాలు సేకరిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ శశీ దేవి తెలిపారు. అనుమతులు లేని, నిబంధనలు పాటించని ఆశ్రమాల నిర్వాహకులపై చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఇంటికి చేరి విగతజీవులై..

చింతపల్లి, కొయ్యూరులో ముగ్గురి మృతి

చింతపల్లి/కొయ్యూరు, ఆగస్టు 19: అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతతో ఇళ్లకు వచ్చిన విద్యార్థుల్లో చింతపల్లి మండలానికి చెందిన ఇద్దరు, కొయ్యూరు మండలానికి చెందిన ఒకరు మృతి చెందారు. పది మందిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులు, అధికారుల కథనం ప్రకారం.. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 55 మంది ఆదివాసీ విద్యార్థులు కైలాసపట్నంలోని ప్రైవేటు అనాథ ఆశ్రమంలో నివాసముంటూ అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటి, రెండు, మూడు తరగతుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. శనివారం అనాథ ఆశ్రమంలో ఓ వివాహంలో మిగిలిపోయిన బిర్యానీ తీసుకొచ్చి విద్యార్థులకు పెట్టడంతో అదే రోజు రాత్రి నుంచి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు వాంతులు, విరేచనాలతో బాధపడుతుండడంతో నిర్వాహకులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి, పిల్లలకు బాగోలేదని వెంటనే రావాలని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు ఆదివారం ఉదయం కైలాసపట్నం వెళ్లి విద్యార్థులను ఇళ్లకు తీసుకొచ్చారు. విద్యార్థులకు సకాలంలో చికిత్స అందకపోవడం, గ్రామాల్లో రాత్రి వేళ వైద్యం అందించే పరిస్థితి లేకపోవడంతో మండలంలోని కిటుముల పంచాయతీ నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తాంబేలి జాషువా(7), ఎ.శనివారం పంచాయతీ జంగంచట్రు గ్రామానికి చెందిన కొర్ర సాధ(10) ఆదివారం రాత్రి మృతిచెందారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం చేసేందుకు కుటుంబ సభ్యులు చింతపల్లి సీహెచ్‌సీకి తీసుకొచ్చారు.

ఏరియా ఆస్పత్రికి పది మంది విద్యార్థులు తరలింపు


కలుషిత ఆహారం తిని అస్వస్థతతో ఇళ్లకు వచ్చిన 10 మంది విద్యార్థులను తాజంగి, లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక చికిత్స అందించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ టి.రామకృష్ణ, ఎంపీడీవో వీరసాయిబాబు వీఆర్వోలను విద్యార్థుల స్వగ్రామాలకు పంపించి బాధితులను ఏరియా ఆస్పత్రికి తరలించారు. పొలంబంద గ్రామానికి చెందిన బి.బ్లెస్సీ జెస్సికా, ఎం.రంజిత్, ప్రశాంత్, జ్యోతి, అరవిందు, పి.మోనిక, నిమ్మలపాలెం గ్రామానికి చెందిన మౌనిక, గీతలను అంబులెన్స్‌లో గ్రామాల నుంచి లంబసింగి పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ప్రాథమిక చికిత్స అందించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎ.శనివారం జంగంచట్రు గ్రామానికి చెందిన కొర్ర నయోమి(మృతి చెందిన విద్యార్థి సాధ అక్క), చెక్కరాయిబంధ గ్రామానికి చెందిన కొర్ర జ్యోతిలను కొంతవరకు డోలీపై మోసుకొచ్చి అక్కడ నుంచి అంబులెన్స్‌లో తాజంగి పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. పీహెచ్‌సీలో వైద్యాధికారి భవాని ... మిగతా 6వ పేజీలో


నర్సీపట్నం ఆస్పత్రి నుంచి ముగ్గురు విద్యార్థులను అంబులెన్స్‌లో కేజీహెచ్‌కి తరలిస్తున్న దృశ్యం

తాండవ నీరు విడుదల

- ఆయకట్టు రైతుల ఆనందం

నాతవరం, ఆగస్టు 19: అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేల ఎకరాలకు తాండవ నీటిని ఆయకట్టు రైతులతో కలిసి డీఈఈ అనురాధ సోమవారం విడుదల చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ముందుగా నిర్ణయించి ముహూర్తం ప్రకారం ఉదయం 8.45 గంటలకు తాండవ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈఈ అనురాధ మాట్లాడుతూ తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 376.7 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ నీరు తాండవ ఆయకట్టు రైతులకు నిరంతరం విడుదల చేస్తే 80 రోజులు సరిపోతుందని తెలిపారు. అలాగే తాండవలోకి ఇన్‌ఫ్లో ద్వారా 800 క్యూసెక్కుల నీరు వస్తున్నదన్నారు. ప్రస్తుతం కుడి కాలువకు 100 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువకు 230 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు చెప్పారు. అనకాపల్లి జిల్లాలో 32,689 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 18,776 ఎకరాలు వరిసాగవుతుందని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, నర్సీపట్నం జడ్పీటీసీ సభ్యురాలు చుక్కల రమణమ్మ, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, తదితరులు పాల్గొన్నారు.


పరవళ్లు తొక్కుతూ బయటకు వస్తున్న తాండవ నీరు

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

తుమ్మపాల, ఆగస్టు 19 : ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిని సారించాలని, అందుకు అనుగుణంగా వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖకు జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలకు సంబంధించి ఎన్టీఆర్ వైద్యాలయం మూడు సర్టిఫికెట్లు సాధించడం ఆనందదాయకమన్నారు. అలాగే 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏడు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లకు అభినందనలు తెలియజేశారు. ఆస్పత్రులకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని, వైద్య ప్రమాణాలను పాటించడంలో వైద్య సిబ్బంది మరింత జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యాధికారులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

'అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి'

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందుతున్న అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శంకరంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదీల నుంచి అర్జీలను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడారు. అనంతరం అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అర్జీల పరిష్కారలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించరాదన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమానికి 143 అర్జీలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, డిప్యూటీ కలెక్టర్ రమామణి, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా

తుమ్మపాల, ఆగస్టు 19: అనకాపల్లి శంకరం వద్ద గల ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏడవ విడత మొబైల్ రికవరీ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు బాధితులకు రూ.32 లక్షల విలువ చేసే 284 సెల్‌ఫోన్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి నుంచి 3,300 ఫిర్యాదులు అందగా ఏడు విడతలల్లో 1930 పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీ డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణరావు, అప్పలనాయుడు, ఐటీ కోర్ ఎస్‌ఐ రవివర్మ పాల్గొన్నారు.



రికవరీ చేసిన మొబైల్‌ను అందజేస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

'ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు'

తుమ్మపాల, ఆగస్టు 19 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్టు దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేరుగా ఫిర్యాదీల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి 25 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీ డీఎస్పీ బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రద్దీగా ఆర్టీసీ కాంప్లెక్స్

▸▸ పలు బస్సులు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు నిరీక్షణ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19: అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ సోమవారం ప్రయాణికులతో రద్దీగా మారింది. అయితే సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. శుభకార్యాలు, రాఖీ పండగ సందర్భంగా పట్టణానికి వచ్చి పోయే గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులతో పాటు పట్టణం నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని బంధువులు, కుటుంబసభ్యులను కలిసేందుకు వెళ్లే ప్రయాణికులతో పాసింజర్ బస్సులు నిలిపే ప్లాట్‌ఫారం రద్దీగా కనిపించింది. ముఖ్యంగా విజయనగరం, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం ప్రాంతాల వైపు వెళ్లే బస్సులు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. ఈ విషయమై డిపో అధికారులను వివరణ కోరగా డిపోలోని అన్ని బస్సులు, అన్ని రూట్‌ల్లో నడుస్తున్నాయని తెలిపారు. అయితే సోమవారం రద్దీ పెరిగిందని అందుకు అనుగుణంగా అవసరమైన మార్గాల్లో ప్రయాణికులకు బస్సులను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టామని వివరించారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

సబ్బవరం, ఆగస్టు 19 : కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘాతుకాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి కూటమి నేతలు ఇక్కడ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందలి రమణ, బలిరెడ్డి అప్పారావు, గవర అప్పారావు, సత్యనారాయణ, శరగడం రాము, వెంకటేశ్వరరావు, బంతికోళ్ల పద్మ, ఉగ్గిన రాము, పల్ల తాతారావు, కర్రి కనకరాజు, దుర్గాప్రసాద్, బలిరెడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తుమ్మపాల, ఆగస్టు 19 : అనకాపల్లిలోని గవరపాలెంలో చిన రామ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో యోగసిద్ధి అంజనేయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఈ వేడుక సాగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్‌తో పాటు పలువురు ప్రముఖులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నూకాంబికను దర్శించుకున్న 'మాధవపెద్ది'


మాధవపెద్దికి చిత్రపటాన్ని అందిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19 : ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ సోమవారం ఇక్కడి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. బాలాలయంలో సురేష్ దంపతులు పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాన్ని టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ బహూకరించారు. ఇదిలావుంటే, పట్టణంలోని కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ వార్షికోత్సవానికి మాధవపెద్ది ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఇలా జరుగుతుందని ఊహించలేదు...

... 5వ పేజీ తరువాయి

చేర్పించామన్నారు. అక్కడ బాగా చదువుకుంటుందని ఆశపడ్డామన్నారు. ఆశ్రమ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ దారుణం సంభవించిందన్నారు. పిల్లలకు వాంతులు, విరేచనాలు అయితే ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా...తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి పంపించేశారన్నారు. మరో చిన్నారి గీత తండ్రి బాబూరావు మాట్లాడుతూ శనివారం రాత్రి నుంచే పాపకు వాంతులు అవుతున్నాయని, కానీ, తీరిగ్గా ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం ఫోన్ చేశారన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే పాపను ఆశ్రమంలో చేర్పించామని, కానీ ఇలా జరిగిందని వాపోయారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

... 5వ పేజీ తరువాయి

వెళ్లిన తరువాత విద్యార్థుల పరిస్థితి మరింత విషమించిందని చెబుతున్నారు. ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు ఉండరని, ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే డబ్బులు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తుందని సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య చేయిద్దామని అనుకున్నామని చింతపల్లి మండలం పొలంబంద గ్రామానికి చెందిన మర్రి చందు తెలిపారు. హాస్టల్‌లో ఉంచితే చదువు బాగా చెబుతారని తెలిసినవారు చెబితే తన ఇద్దరు పిల్లలు ప్రశాంత్, రంజిత్‌లను చేర్పించామని చెప్పారు. సోమవారం తన ఇద్దరు పిల్లల పరిస్థితి బాగాలేకపోతే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చామని తెలిపారు.

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో..

అస్వస్థతకు గురైన 34 మంది విద్యార్థులు ప్రాంతీయ ఆస్పత్రి అత్యవసర విభాగంలో చికిత్స పొందారు. వీరిలో కొంత మందిని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, ప్రజా సంఘాల నాయకులతో ఏరియా ఆస్పత్రి నిండి పోయింది. సోమవారం మధ్యాహ్నానికి 16 మంది విద్యార్థులను ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, ఇక్కడ వైద్యులు హుటాహుటిన అత్యవసర వైద్య సేవలు అందించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కి తరలించారు. తరువాత కొయ్యూరు మండలం డౌనూరు నుంచి మరో 18 మంది విద్యార్థులను ఏరియా ఆస్పత్రికి తీసుకు రాగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కి తరలించారు. మిగిలిన వారికి ఏరియా ఆస్పత్రిలో వైద్యం చేస్తున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఎస్పీ దీపిక, ఆర్డీవో జయరాం, డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు ఏరియా ఆస్పత్రిని సందర్శించి గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి, వైద్యులను ఆరా తీశారు.

ఆస్పత్రిలో పరుగులు పెట్టిన డాక్టర్లు

ఏరియా ఆస్పత్రిలో తీవ్ర అస్వస్థతతో చేరిన చిన్నారుల ప్రాణాలు కాపాడే ప్రయత్నంలో వైద్యులు పరుగులు పెట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి, చిన్ని పిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్, మిగిలిన వైద్యులు, వైద్య సిబ్బంది వేగవంతమైన సేవలు అందించారు. ఉదయం నుంచి రాత్రి వరకు మొత్తం 34 మంది విద్యార్థులకు అత్యవసర వైద్య సేవలు అందించారు.

వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు.. ఏరియా ఆస్పత్రి వైద్యులు అందించి వేగవంతమైన వైద్య సేవలను ప్రశంసించారు.

ఇంటికి చేరి....

... 5వ పేజీ తరువాయి

ప్రాథమిక చికిత్స అందించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, విషమంగా ఉన్న ఏడుగురు విద్యార్థులను కేజీహెచ్‌కి తరలించామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.

డౌనూరు పంచాయతీలో మరొకరు..

కొయ్యూరు: అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని మండలానికి చెందిన ఒక విద్యార్థిని మృతి చెందగా, మరో 27 మంది అస్వస్థతకు గురయ్యారు. మండలంలో డౌనూరు పంచాయతీ రెల్లలపాలెం పీవీటీజీ వీధికి చెందిన గెమ్మెలి భవాని(8) ఆదివారం రాత్రి మృతి చెందింది. నిర్వాహకులు వైద్య సేవలు అందించకుండా తల్లిదండ్రులను రప్పించి వారితో ఇళ్లకు బలవంతంగా పంపించడంతో మండలానికి చెందిన 28 మంది స్వగ్రామాలకు చేరుకొనేందుకు బయలుదేరి రాత్రి సమయానికి డౌనూరు, రాజేంద్రపాలేనికి చేరుకున్నారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర అస్వస్థతకు గురవడంతో వారిని డౌనూరు పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వెంటనే వైద్యాధికారిణి లలిత అప్రమత్తమై ఇద్దరు విద్యార్థులకు వైద్య సేవలందించారు. మిగిలిన వారిని వైద్య సిబ్బంది సహకారంతో పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించారు. అయితే రెల్లలపాలేనికి చెందిన గెమ్మెలి సత్యారావు, కుమారిల కుమార్తె భవాని ఇంటికి వెళ్లిపోవడంతో ఆమెకు సకాలంలో సరైన వైద్య సేవలందక రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందింది. డౌనూరు పీహెచ్‌సీలో మండలానికి చెందిన డౌనూరు పంచాయతీ రెల్లలపాలెంకు చెందిన సీందరి రవి (8), తాంబేలు ఎలియా(7), ప్రభాస్ (14), గెమ్మెలి చందు(12), మర్రి అలేఖ్య(12), గెమ్మెలి దాన్యత(9), వంశీ(6), తాంబేలి శ్రీను(8), సీందరి చరణ్ (10), కిల్లో మహిమ(9), శైలు(9), గెమ్మెలి శంకరరావు(14), తాంబేలి రాము(10), నందిని (11), మర్రిపాలెంకు చెందిన పాంగి సంతోష్(10), బూదరాళ్ల పంచాయతీ పొర్లుబందకు చెందిన కొర్రా నాగేశ్వరి(12) చికిత్స పొందుతున్నారు. వీరిలో రవి, ఎలియా, నాగేశ్వరి పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ పరిస్థితిని ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి తీసుకెళ్లారు. పీవో వెంటనే స్పందించి అంబులెన్స్ సౌకర్యం కల్పించడంతో ముగ్గురు విద్యార్థులను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అలాగే రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో పాంగి లావణ్య (7), అనిత (7), అంజలి(7), శివాజీ (8), జగన్(9), కొర్రా సురేష్(7), గణేష్(8), పాంగి నందిని (7), గెమ్మెలి దావీదు(8), కిల్లో మహిమ(6), కిల్లో సైలు(8) వైద్య సేవలు పొందుతున్నారు.

ఉచితంగా చదివిస్తారని ఆశపడ్డాం

చర్చి నిర్వాహకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా మృతి చెందిన గెమ్మెలి భవాని తల్లిదండ్రులు సత్యారావు, కుమారి కన్నీరుమున్నీరవుతున్నారు. క్రిస్టియన్ సంస్థ అందించే ఉచిత విద్యతో కుమార్తెను ఉన్నత చదువులు చదివించుకుందామని ఆశపడ్డామని, ఇలా పోగొట్టుకుంటామని అనుకోలేదంటూ విలపించారు.

బదిలీపై వెళుతున్న ఏఎస్పీకి ఘన సత్కారం


ఏఎస్పీ విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19: జిల్లా అడిషినల్ ఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న అడిషినల్ ఎస్పీ బి.విజయభాస్కర్ ఆత్మీయ వీడ్కోలు సమావేశం సోమవారం రాత్రి స్థానిక పోలీస్ అతిథి గృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ ఎం.దీపిక.. విజయభాస్కర్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బి.అప్పారావు, ఎస్.అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, ఎం.ఉపేంద్రబాబు, పి.నాగేశ్వరరావు, ఎస్పీ కార్యాలయ ఏవో బి.శారదా, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు హరిపురంలో సుందరపు జన్మదిన వేడుకలు

రాంబిల్లి, ఆగస్టు 19 : మండలంలోని హరిపురంలో గల జనసేన కార్యాలయంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టారు. ముందుగా ఎమ్మెల్యే ఉదయం ఎనిమిది గంటలకు తమ స్వగ్రామమైన కొత్తూరులో కుటుంబ ఆరాధ్యదేవత గుమ్మడి అమ్మలు పేరంటాలను దర్శించుకుంటారు. ఆ తరువాత ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు హరిపురం జనసేన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఆ పార్టీ రాంబిల్లి మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర తెలిపారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు.

సూక్ష్మ హస్తకళాకారిణి లావణ్యకు సత్కారం

ఎలమంచిలి, ఆగస్టు 19 : హస్తకళా రంగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఏటికొప్పాక గ్రామానికి చెందిన సూక్ష్మ హస్తకళాకారిణి చింతల లావణ్యను సోమవారం బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అంకుడు కర్రతో ఆమె అతి చిన్న సైజులో లక్ష్మీదేవి కళాఖండాన్ని అత్యద్భుతంగా చెక్కారు. ఈమె ప్రతిభను గుర్తించి ఎంపీ సీఎం రమేష్ సూచన మేరకు ఇక్కడ బీజేపీ నాయకులు పవన్, బాబ్జీ, కొల్లి సత్యనారాయణ, శ్రీనివాస్, నూకరాజు సత్కరించారు.

లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్ మృతి

కొత్తూరు, ఆగస్టు 19: వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు సోమవారం తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా గంట్యాడ ప్రాంతానికి చెందిన చలపురెడ్డి గోపాల్(38) విజయనగరం నుంచి రాజమండ్రికి ప్రయాణికులను దించేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి విజయనగరం వెళుతుండగా జాతీయ రహదారి అనకాపల్లి మండలం రాయుడుపాలెం వద్ద సబ్బవరం నుంచి అనకాపల్లి వస్తున్న లారీ అదే మార్గంలో రాంగ్‌రూటులో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

'బంద్‌ను విజయవంతం చేయండి'

పాయకరావుపేట, ఆగస్టు 19 : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నిర్వహించనున్న దేశవ్యాప్త బంద్‌ను అంతా విజయవంతం చేయాలని పాయకరావుపేట జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో పెదపాటి మేఘరంజన్, నెలపర్తి అర్జున్ తదితరులు మాట్లాడారు. దళిత నాయకులు నెలపర్తి నాగరాజు, ఇంజరపు సూరిబాబు, తాటిపాక లోవరాజు, సీహెచ్.పేర్రాజు, పల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ పరిసరాల్లో భారీ వర్షం

పరవాడ, ఆగస్టు 19 : మండల కేంద్రం పరవాడ, దేశపాత్రునిపాలెం, కలపాక తదితర ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. సుమారు ఇరవై నిమిషాలకు పైగా ఏకధాటిగా పడడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజానీకం చల్లబడడంతో ఉపశమనం పొందారు.


ఆశల దీపాలు ఆరిపోయాయి

... 5వ పేజీ తరువాయి

పాస్టర్ నిర్వహిస్తుండడంతో తమ పిల్లలకు ఏలోటూ ఉండదని ఆదివాసీలు భావించారు. అయితే పాస్టర్ నిర్లక్ష్యంగా ఓ వివాహ విందులో మిగిలిపోయిన బిర్యానీని రాత్రి వేళ పిల్లలకు పెట్టడంతో పెనువిషాదం చోటుచేసుకుంది.

ఆస్పత్రిలో చేర్పించి ఉంటే ప్రాణహాని తప్పేది..

అస్వస్థతకు గురైన విద్యార్థులను పాస్టర్ వెంటనే సమీపంలోనున్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించేశారు. నిరక్షరాస్యులైన ఆదివాసీలు పిల్లలను ఆస్పత్రికి తీసుకొని వెళ్లకుండా ఇళ్లకు తీసుకువెళ్లిపోయారు. దాంతో పరిస్థితి విషమించింది.


















శ్రమకు మించిన ప్రత్యామ్నాయం లేదు

▸▸ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి

సబ్బవరం, ఆగస్టు 19: వృత్తిపరమైన సమగ్రతను కాపాడుకోవడానికి శ్రమను మించిన ప్రత్యామ్నాయం లేదని డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ చాన్సలర్, సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి తెలిపారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్ చైర్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి 'నావిగేషన్ లా స్కూల్ అండ్ లీగల్ ప్రొఫెషన్' అనే అంశంపై ప్రసంగిస్తూ.. న్యాయ వ్యవస్థలు గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. న్యాయవాదులు, న్యాయ నిపుణులను రూపొందించడం ద్వారా మార్పు కోసం ఈ కార్యక్రమాన్ని ఉపన్యాసం కంటే లైవ్ ఇంటరాక్షన్, అనుభవాన్ని పంచుకునే సెషన్‌గా పరిగణించాలన్నారు. డిఫెన్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంలో విఫలమైనప్పటికీ 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఎదిగిన డాక్టర్ అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు నిరుత్సాహపడకుండా ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఆయన డీఎస్ఎన్ఎల్‌యూ మధ్యవర్తిత్వ పోటీకి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం సుప్రీం కోర్టు న్యాయమూర్తి మహేశ్వరిని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి అలపాటి గిరిధర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, డాక్టర్ దయానందమూర్తి, అకడమిక్ డైరెక్టర్ సోమాభట్టాచార్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరిని సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు














భోగాపురంలో కిడ్నీ వ్యాధితో మరొకరి మృతి

అచ్యుతాపురం, ఆగస్టు 19: మండలంలోని భోగాపురంలో మరో కిడ్నీ వ్యాధిగ్రస్థుడు సోమవారం మృతి చెందాడు. దీంతో పదేళ్లలో మృతుల సంఖ్య 16కు చేరింది. ఇంకా అనేక మంది వ్యాధి పీడి తులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. తాగునీరులో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉందని, దీని వల్లే కిడ్నీ సంబంధిత వ్యాధి వస్తున్నదని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ స్థులు ఆరోపిస్తున్నారు. భోగాపురంలో కిడ్నీ బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ సమస్యపై గత నెల 20న 'అయ్యో పాపం భోగా పురం' శీర్షికన 'ఆంధ్ర జ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు గ్రామాన్ని సందర్శించి హడావిడి చేశారు. గ్రామంలో 12 బోర్లున్నాయని, అందులో కొన్ని బోర్ల నీటిలో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉందని భావిస్తున్నామని చెప్పారు. నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతున్నామని, కలెక్టర్‌తో చర్చించి భోగాపురంలో ఆర్‌వో ప్లాంటు ప్రారంభిస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఇదిలావుంటే, సోమవారం కిడ్నీవ్యాధితో మృతి చెందిన కూండ్రపు నాగేశ్వరరావు ఎనిమిది సంవత్సరాలుగా ఈవ్యాధితో బాధపడుతున్నాడు. గ్రామంలో నీటివల్ల కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని తెలిసి గ్రామాన్ని వదిలి జంగులూరు జంక్షన్‌కి కాపురం కూడా మార్చారు.









స్పీకర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్



అయ్యన్నకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

నర్సీపట్నం, ఆగస్టు 19 : రక్షా బంధన్ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు శాసన సభ స్పీకర్ సీహెచ్. అయ్యన్నపాత్రుడుకి రాఖీ కట్టి ప్రసాదం అందజేశారు. సోమవారం నర్సీపట్నంలోని ఆయన నివాసంలో బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు సభాపతిని కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

పుస్తకాలు పంపిణీ



యూత్ సభ్యులు అందించిన పుస్తకాలతో విద్యార్థులు

మాకవరపాలెం, ఆగస్టు 19 : తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఇంగ్లీషు పుస్తకాలను పంపిణీ చేశారు. ఇదే గ్రామానికి చెందిన కిల్లాడ వెంకటరమణ అండ్ యూత్ సభ్యులు నాలుగు వేల రూపాయలు విలువ చేసే ఇంగ్లీష్ రాత పుస్తకాలను కొనగోలు చేసి విద్యార్థులకు అందజేశారు. ఏటా తమ సంపాదనలో కొంత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికోసం ఖర్చు చేస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులతో పాటు ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులందరికీ ఈక్రాప్ తప్పనిసరి

▸ వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రనాథ్



అంకుపాలెంలో ఈక్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఏడీ

చోడవరం, ఆగస్టు 19: పంటలు వేసిన రైతులంతా తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని స్థానిక వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రనాథ్ తెలిపారు. సోమవారం మండలంలోని అంకుపాలెం గ్రామంలో ఈక్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇతర రాయితీల అమలు, ధాన్యం అమ్మకాలు, ఇలా అన్నింటికీ ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా అవసరమని స్పష్టం చేశారు. దీన్ని రైతులు గుర్తించి ఈక్రాప్‌నకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో పావని, వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు.

ఆశల దీపాలు ఆరిపోయాయి

... 5వ పేజీ తరువాయి

పాస్టర్ నిర్వహిస్తుండడంతో తమ పిల్లలకు ఏలోటూ ఉండదని ఆదివాసీలు భావించారు. అయితే పాస్టర్ నిర్లక్ష్యంగా ఓ వివాహ విందులో మిగిలిపోయిన బిర్యానీని రాత్రి వేళ పిల్లలకు పెట్టడంతో పెనువిషాదం చోటుచేసుకుంది.

ఆస్పత్రిలో చేర్పించి ఉంటే ప్రాణహాని తప్పేది..

అస్వస్థతకు గురైన విద్యార్థులను పాస్టర్ వెంటనే సమీపంలోనున్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించేశారు. నిరక్షరాస్యులైన ఆదివాసీలు పిల్లలను ఆస్పత్రికి తీసుకొని వెళ్లకుండా ఇళ్లకు తీసుకువెళ్లిపోయారు. దాంతో పరిస్థితి విషమించింది.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

... 5వ పేజీ తరువాయి

వెళ్లిన తరువాత విద్యార్థుల పరిస్థితి మరింత విషమించిందని చెబుతున్నారు. ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు ఉండరని, ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే డబ్బులు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తుందని సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య చేయిద్దామని అనుకున్నామని చింతపల్లి మండలం పొలంబంద గ్రామానికి చెందిన మర్రి చందు తెలిపారు. హాస్టల్‌లో ఉంచితే చదువు బాగా చెబుతారని తెలిసినవారు చెబితే తన ఇద్దరు పిల్లలు ప్రశాంత్, రంజిత్‌లను చేర్పించామని చెప్పారు. సోమవారం తన ఇద్దరు పిల్లల పరిస్థితి బాగాలేకపోతే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చామని తెలిపారు.

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో..

అస్వస్థతకు గురైన 34 మంది విద్యార్థులు ప్రాంతీయ ఆస్పత్రి అత్యవసర విభాగంలో చికిత్స పొందారు. వీరిలో కొంత మందిని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, ప్రజా సంఘాల నాయకులతో ఏరియా ఆస్పత్రి నిండిపోయింది. సోమవారం మధ్యాహ్నానికి 16 మంది విద్యార్థులను ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, ఇక్కడ వైద్యులు హుటాహుటిన అత్యవసర వైద్య సేవలు అందించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కి తరలించారు. తరువాత కొయ్యూరు మండలం డౌనూరు నుంచి మరో 18 మంది విద్యార్థులను ఏరియా ఆస్పత్రికి తీసుకు రాగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కి తరలించారు. మిగిలిన వారికి ఏరియా ఆస్పత్రిలో వైద్యం చేస్తున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఎస్పీ దీపిక, ఆర్డీవో జయరాం, డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు ఏరియా ఆస్పత్రిని సందర్శించి గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి, వైద్యులను ఆరా తీశారు.

ఆస్పత్రిలో పరుగులు పెట్టిన డాక్టర్లు

ఏరియా ఆస్పత్రిలో తీవ్ర అస్వస్థతతో చేరిన చిన్నారుల ప్రాణాలు కాపాడే ప్రయత్నంలో వైద్యులు పరుగులు పెట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి, చిన్ని పిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్, మిగిలిన వైద్యులు, వైద్య సిబ్బంది వేగవంతమైన సేవలు అందించారు. ఉదయం నుంచి రాత్రి వరకు మొత్తం 34 మంది విద్యార్థులకు అత్యవసర వైద్య సేవలు అందించారు. వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు.. ఏరియా ఆస్పత్రి వైద్యులు అందించి వేగవంతమైన వైద్య సేవలను ప్రశంసించారు.

గ్రోయిన్ ఇలా.. పంటల సాగు ఎలా..?

▸ ఐదేళ్ల క్రితం తుఫాన్ కారణంగా దెబ్బతినడంతో తూటిపాల రైతులకు కష్టాలు

▸ పట్టించుకోని పాలకులు ▸ వరి పంటకు నీరు అందే అవకాశం లేక పలువురు సరుగుడుపై ఆసక్తి



తూటిపాల గెడ్డలో పాడైన గ్రోయిన్

మాకవరపాలెం, ఆగస్టు 19 : మండలంలోని తూటిపాల గెడ్డలో ఉన్న గ్రోయిన్ పూర్తిగా దెబ్బతింది. దీనిపై దృష్టి సారించేవారు లేకపోవడంతో రైతులు తీవ్ర ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లుగా ఈ గ్రోయిన్ మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో పంటల సాగుకు నీరు అందడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల కిందట గెడ్డలో ఉన్న గ్రోయిన్ తుఫాన్ కారణంగా పాడైంది. నాటి నుంచి నేటి వరకు వృథాగా ఉంది. ఈ గ్రోయిన్ ద్వారా తూటిపాల లోని సుమారు 400 ఎకరాలకు నీరు అందేది. దీంతో రైతులు చక్కగా పంటలను పండించుకునేవారు. ప్రస్తుతం గ్రోయిన్ పూర్తిగా దెబ్బతినడంతో వరిసాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారంతా వాపోతున్నారు. వర్షాలు కురిస్తే తప్ప వరిపంట పండించలేదని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని అంటున్నారు. గత్యంతరం లేక కొంతమంది వరిసాగుకు దూరమవుతున్నారు. సుమారు వంద ఎకరాల్లో రైతులు సరుగుడు వేశారు. ముున్ముందు ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయ పనులకు తాము దూరమయ్యే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగు నీరు లేకపోవడంతో ఈ ఏడాది అరకొరగానే వరిసాగు చేపట్టినట్టు వారు చెపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టాల్సిందిగా ఆ పరిధిలోని రైతులంతా కోరుతున్నారు.

చీడిగుమ్మలను వేధిస్తున్న చెత్త సమస్య

▸ శివాలయం వద్ద రోడ్డు పక్కన పేరుకుపోయిన కుప్పలు

▸ రాకపోకలకు అవస్థలు పడుతున్న జనం ▸ వెంటాడుతున్న వ్యాధుల భయం



చీడిగుమ్మల శివాలయం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

గొలుగొండ, ఆగస్టు 19 : చీడిగుమ్మలలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. ప్రధానంగా శివాలయం వద్ద రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని చూసి పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో సుమారు ఐదువేల మందికి పైగా జనాభా నివాసం ఉంటున్నారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం ఈ పంచాయతీకి ట్రాక్టర్‌తో పాటు సిబ్బందిని ఏర్పాటు చేసింది. అయితే చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదనే వాదన వినిపిస్తోంది. దీంతో చెత్తాచెదారాన్ని పలువురు మూటలుగా కట్టి వాహనాలపై తెచ్చి రోడ్డు పక్కన పారబోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెత్తలో నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది, ఈ కారణంగా అంటు వ్యాధుల భయం వెంటాడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందుతున్న తరుణంలో ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఇక్కడ చెత్త సమస్యకు పరిష్కారం చూపాల్సిందిగా అంతా కోరుతున్నారు.

వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ





దేవరాపల్లిలో కొవ్వొత్తులతో మానవహారం.. రోలుగుంటలో నిరసన ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు

దేవరాపల్లి, ఆగస్టు 19: కొలకత్తాలో వైద్య విద్యార్థిని హత్యాచారాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి మండల కేంద్రంలో యువత కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. మహిళలు స్వేచ్ఛగా తిరిగినప్పుడు సమాజంలో స్త్రీకి గౌరవం దక్కుతుందన్నారు. ఎవ్వరికీ ఈ విధంగా జరగకూడదని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీరమణ, ఆర్.వెంకటరావు, శ్రీను, సంతోష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడికి నిరసనగా సోమవారం రోలుగుంటలోని ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. హత్యకు గురైన వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. సత్వరమే విచారణ చేపట్టి దోషుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధుల నివారణకు టీకాలు

▸ మాడుగుల ఏరియా పశు వైద్యశాల

▸ సహాయ సంచాలకులు చిట్టినాయుడు



రికార్డులు పరిశీలిస్తున్న చిట్టినాయుడు

మాడుగుల, ఆగస్టు 19: పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధులు సోకకుండా టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు తెలిపారు. సోమవారం స్థానిక పశు వైద్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధులు సోకకుండా ఈ నెల 20వ తేది నుంచి వచ్చేనెల 18వ తేడీ వరకు ఈ టీకాలు వేస్తామని చెప్పారు. దీన్ని ప్రతీ ఒక్క పాడిరైతు వినియోగించుకోవాలని కోరారు. అలాగే మంజూరైన 25 గోకులం షెడ్లకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అలాగే పాడి పశువులకు ఇన్సూరెన్సూ చేయిస్తామన్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతీ పశువుకు దగ్గరల్లోని పశు వైద్యశాల, ఆర్బీకేల్లోని పశు వైద్య సిబ్బందిని సంప్రదించి టీకాలు వేయించవచ్చునన్నారు. సోమవారం వీరవిల్లి అగ్రహారం ఆర్బీకే తనిఖీ చేసి పశు శాఖకు సంబంధించిన రికార్డులు ఆయన పరిశీలించారు. పాడి రైతులు వివరాలు అందిస్తున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాడి రైతులు టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బీఎన్ రోడ్డులో గతుకుల పూడ్చివేత



వడ్డాది బ్యాంకు సమీపంలో వెట్ మిక్స్‌తో గొయ్యిలు పూడుస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, ఆగస్టు 19: వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా దెబ్బతిన్న భీమునిపట్నం-నర్సీపట్నం(బిఎన్) రోడ్డు మరమ్మతుల పనులకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. చోడవరం నుంచి వడ్డాది కూడలి వరకు బీఎన్ రోడ్డులో పడ్డ గొయ్యిలను వెట్‌మిక్స్‌తో పూడ్చి వేస్తున్నారు. తదినంతరం వెట్‌మిక్స్‌పై బీటీ వేస్తామని ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. నాలుగేళ్లగా బీఎన్ రోడ్డులో రవాణాకు అనకాపల్లి, అల్లూరి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయం విదితమే. గెలిచిన రెండు నెలల్లోనే బీఎన్ రోడ్డు మరమ్మతులపై చోడవరం ఎమ్మెల్యే రాజు దృష్టి సారించారు. ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టరుతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి, ముందుగా పెద్ద పెద్ద గొయ్యిలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ మేరకు గుర్తించిన గొయ్యిలను ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి, వెట్‌మిక్స్‌తో పూడ్చివేసి రోలర్‌తో రోలింగ్ చేస్తున్నారు.

నూకాంబికను దర్శించుకున్న 'మాధవపెద్ది'



మాధవపెద్దికి చిత్రపటాన్ని అందిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19 : ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ సోమవారం ఇక్కడి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. బాలాలయంలో సురేష్ దంపతులు పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాన్ని టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ బహూకరించారు.

ఇలా జరుగుతుందని ఊహించలేదు...

... 5వ పేజీ తరువాయి

చేర్పించామన్నారు. అక్కడ బాగా చదువుకుంటుందని ఆశపడ్డామన్నారు. ఆశ్రమ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ దారుణం సంభవించిందన్నారు. పిల్లలకు వాంతులు, విరేచనాలు అయితే ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా...తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి పంపించేశారన్నారు. మరో చిన్నారి గీత తండ్రి బాబూరావు మాట్లాడుతూ శనివారం రాత్రి నుంచే పాపకు వాంతులు అవుతున్నాయని, కానీ, తీరిగ్గా ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం ఫోన్ చేశారన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే పాపను ఆశ్రమంలో చేర్పించామని, ఇలా జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదని వాపోయారు.

ఇంటికి చేరి విగతజీవులై..

... 5వ పేజీ తరువాయి

ప్రాథమిక చికిత్స అందించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, విషమంగా ఉన్న ఏడుగురు విద్యార్థులను కేజీహెచ్‌కి తరలించామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.

డౌనూరు పంచాయతీలో మరొకరు..

కొయ్యూరు: అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని మండలానికి చెందిన ఒక విద్యార్థిని మృతి చెందగా, మరో 27 మంది అస్వస్థతకు గురయ్యారు. మండలంలో డౌనూరు పంచాయతీ రెల్లలపాలెం పీవీటీజీ వీధికి చెందిన గెమ్మెలి భవాని(8) ఆదివారం రాత్రి మృతి చెందింది. నిర్వాహకులు వైద్య సేవలు అందించకుండా తల్లిదండ్రులను రప్పించి వారితో ఇళ్లకు బలవంతంగా పంపించడంతో మండలానికి చెందిన 28 మంది స్వగ్రామాలకు చేరుకొనేందుకు బయలుదేరి రాత్రి సమయానికి డౌనూరు, రాజేంద్రపాలేనికి చేరుకున్నారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర అస్వస్థతకు గురవడంతో వారిని డౌనూరు పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వెంటనే వైద్యాధికారిణి లలిత అప్రమత్తమై ఇద్దరు విద్యార్థులకు వైద్య సేవలందించారు. మిగిలిన వారిని వైద్య సిబ్బంది సహకారంతో పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించారు. అయితే రెల్లలపాలేనికి చెందిన గెమ్మెలి సత్యారావు, కుమారిల కుమార్తె భవాని ఇంటికి వెళ్లిపోవడంతో ఆమెకు సకాలంలో సరైన వైద్య సేవలందక రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందింది. డౌనూరు పీహెచ్‌సీలో మండలానికి చెందిన డౌనూరు పంచాయతీ రెల్లలపాలెంకు చెందిన సీందరి రవి (8), తాంబేలు ఎలియా(7), ప్రభాస్ (14), గెమ్మెలి చందు(12), మర్రి అలేఖ్య(12), గెమ్మెలి దాన్యత(9), వంశీ(6), తాంబేలి శ్రీను(8), సీందరి చరణ్ (10), కిల్లో మహిమ(9), శైలు(9), గెమ్మెలి శంకరరావు(14), తాంబేలి రాము(10), నందిని (11), మర్రిపాలెంకు చెందిన పాంగి సంతోష్(10), బూదరాళ్ల పంచాయతీ పొర్లుబందకు చెందిన కొర్రా నాగేశ్వరి(12) చికిత్స పొందుతున్నారు. వీరిలో రవి, ఎలియా, నాగేశ్వరి పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ పరిస్థితిని ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి తీసుకెళ్లారు. పీవో వెంటనే స్పందించి అంబులెన్స్ సౌకర్యం కల్పించడంతో ముగ్గురు విద్యార్థులను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అలాగే రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో పాంగి లావణ్య (7), అనిత (7), అంజలి(7), శివాజీ (8), జగన్(9), కొర్రా సురేష్(7), గణేష్(8), పాంగి నందిని (7), గెమ్మెలి దావీదు(8), కిల్లో మహిమ(6), కిల్లో సైలు(8) వైద్య సేవలు పొందుతున్నారు.

ఉచితంగా చదివిస్తారని ఆశపడ్డాం

చర్చి నిర్వాహకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా మృతి చెందిన గెమ్మెలి భవాని తల్లిదండ్రులు సత్యారావు, కుమారి కన్నీరుమున్నీరవుతున్నారు. క్రిస్టియన్ సంస్థ అందించే ఉచిత విద్యతో కుమార్తెను ఉన్నత చదువులు చదివించుకుందామని ఆశపడ్డామని, ఇలా పోగొట్టుకుంటామని అనుకోలేదంటూ విలపించారు.

ఘనంగా రాఖీ వేడుకలు



ఎమ్మెల్యే బండారుకు స్వీట్ తినిపిస్తున్న కళావతి

చీడికాడ, ఆగస్టు 19: మండలంలో రాఖీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి రాఖీ కట్టి స్వీటు తినిపించారు. కార్యక్రమంలో చీడికాడ, కె.కోటపాడు మండలాల టీడీపీ అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, రొంగలి మహేష్ నాయకులు రెడ్డి సన్యాసి నాయుడు, రెడ్డి రాము పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...



తాతయ్యబాబుకు రాఖీ కడుతున్న దృశ్యం

బుచ్చెయ్యపేట: మండల వ్యాప్తంగా రాఖీ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కొనుగోళ్లకు వచ్చిన మహిళలతో విక్రయ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుకు పార్టీకి చెందిన మహిళా కార్యకర్తలు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.

నేడు చీడికాడ శ్యామలాంబ భూములకు కౌలు వేలం

చోడవరం, ఆగస్టు 19: చీడికాడ మండల కేంద్రంలోని శ్యామలాంబ అమ్మవారి ఆలయ భూములకు మంగళవారం కౌలు వేలం వేయనున్నట్టు దేవదాయ శాఖ ఈవో ఎస్‌వీవీ.సత్యనారాయణ తెలిపారు. చీడికాడ రామాలయంలో నిర్వహించనున్న ఈ వేలంలో పాల్గొనదలచిన రైతులు రూ.50 నగదు ధరావత్తు చెల్లించాలని సూచించారు.

పక్కాగా ఇంటింటా ఓటర్ల సర్వే

రోలుగుంట, ఆగస్టు 19: ఈ నెల 20వ తేదీ నుంచి ఇంటింటా ఓటర్ల సర్వేను పక్కాగా చేపట్టాలని బీఎల్వోలను డీటీ సోమశేఖర్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాల బీఎల్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. అక్టోబరు 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. సెప్టెంబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారిందరికీ నూతన ఓటర్లగా నమోదు చేయాలని ఆయన సూచించారు. గ్రామాల్లో వివాహమైన, మృతుల ఓట్ల తొలగింపు, సిఫ్టింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, వివిధ గ్రామాల బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

వరుస క్రమంలో నాట్లతో తెగుళ్ల నివారణ

చీడికాడ, ఆగస్టు 19: రైతులు వరుస క్రమంలో నాట్లు వేసుకుంటే వరి పైరుకు తెగుళ్లు దూరమవుతాయని మండల వ్యవసాయ అధికారి రమాదేవి చెప్పారు. మండలంలో జి.కొత్తపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని పెదగోగాడ గ్రామంలో సోమవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పైరుకు సోకే మిత్ర, శత్రు పురుగు, వరి మొనలు తుంచడం, నాట్లు వేసేముందు సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్ల నివారణకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలను చక్కగా నడిపే బాధ్యత కమిటీలదే

▸ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు



విలేకరులతో మాట్లాడుతున్న రాజు

చోడవరం, ఆగస్టు 19: పాఠశాలలను చక్కగా నడిపే బాధ్యత యాజమాన్య కమిటీలదేనని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 36 హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో జనసేన మద్దతుదారులు చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా జన సైనికులు పాఠశాలలను చక్కగా నడిపించడంతో పాటు విద్యారంగం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో సైతం ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మాడుగుల ఎంపీడీవో బదిలీ

మాడుగుల, ఆగస్టు 19: మాడుగుల ఎంపీడీవో ఆర్.కాలి ప్రసాదరావును బదిలీ చేస్తూ జిల్లా అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ ఎన్నికల ముందు శ్రీకాకుళం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఎన్నికల అనంతరం తిరిగి అదే జిల్లాలోని కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. దీంతో ఆయన శ్రీకాకుళం జడ్పీలో సోమవారం రిపోర్టు చేశారు. ఆయన స్థానంలో మాడుగుల ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గోపాలరావు ఇన్‌చార్జి బాధ్యలు అప్పగించారు.

భవిత కేంద్రంలో సౌకర్యాల మెరుగుకు చర్యలు

కె.కోటపాడు, ఆగస్టు 19 : ప్రత్యేక అవసరాల గల పిల్లల్లో జీవనశైలిని పెంచడానికి, భవిత కేంద్రంలో సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, కో-ఆర్డినేటర్ ఎన్.అమ్మినాయుడు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే విద్యార్థుల సృజనా శక్తిని పరిశీలించారు. బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారిచ్చే సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భవితా కేంద్రాలు మరింత ఆధునికరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బుద్ధిమాంద్యం గల పిల్లల్లో మేధోశక్తిని గుర్తించి, వారికి అనుగుణంగా బోధన సాగిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 డీవీడీ.ప్రసాద్, ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మావతి, జిల్లా సహిత విద్యా కో-ఆర్డినేటర్ బి.శకుంతల తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

చీడికాడ, ఆగస్టు 19: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తామని చీడికాడ, పెదగోగాడ పశు వైద్యాధికారులు జి.గాయిత్రిదేవి, కె.రాఘవమ్మ తెలిపారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ మంగళవారం ఉదయం తురువోలులో పశువైద్య శిబిరం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని పాడి రైతులంతా వినియోగించుకోవాలని వారు కోరారు.

క్రైం... crime news

లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్ మృతి

కొత్తూరు, ఆగస్టు 19: వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు సోమవారం తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా గంట్యాడ ప్రాంతానికి చెందిన చలపురెడ్డి గోపాల్(38) విజయనగరం నుంచి రాజమండ్రికి ప్రయాణికులను దించేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి విజయనగరం వెళుతుండగా జాతీయ రహదారి అనకాపల్లి మండలం రాయుడు పాలెం వద్ద సబ్బవరం నుంచి అనకాపల్లి వస్తున్న లారీ అదే మార్గంలో రాంగ్ రూటులో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

గంజాయితో నలుగురి అరెస్టు



గంజాయి నిందితులతో ఎస్ఐ వెంకటరమణ, పోలీసులు

చింతపల్లి, ఆగస్టు 19: ఒడిశా నుంచి బెంగళూరు అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు నిరుద్యోగులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ వెంకట రమణ విలేకరులతో మాట్లాడుతూ లంబసింగి జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు అనుమానంగా సంచరిస్తుండడంతో వారి బ్యాగులు తనిఖీ చేశామన్నారు. అందులో నాలుగు కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా బెంగళూరు పరిసర ప్రాంతాలకు చెందిన గోపీరావు, నగేశ్, కార్తీక్, చిరగ్‌గా గుర్తించామన్నారు. నిందితులందరు నిరుద్యోగులని, గంజాయికి బానిసై వాటిని కొనుగోలు చేసేందుకు ఇక్కడకు వచ్చారన్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు.

ఏఎస్పీ విజయభాస్కర్‌కు సత్కారం



బదిలీపై వెళుతున్న ఏఎస్పీ విజయభాస్కర్‌ను సత్కరించిన ఎస్పీ ఎం.దీపిక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19: జిల్లా అడిషినల్ ఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న అడిషినల్ ఎస్పీ బి.వి జయభాస్కర్ ఆత్మీయ వీడ్కోలు సమావేశం సోమవారం రాత్రి స్థానిక పోలీస్ అతిథి గృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ ఎం.దీపిక.. విజయభాస్కర్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బి.అప్పారావు, ఎస్.అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, ఎం.ఉపేంద్రబాబు, పి.నాగేశ్వరరావు, ఎస్పీ కార్యాలయ ఏవో బి.శారదా, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోర్టు స్టేడియంలో 25వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్మీ ర్యాలీ

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పోర్టు స్టేడియంలో ఈనెల 25వ తేదీ అర్ధరాత్రి నుంచి వచ్చేనెల ఐదోతేదీ వరకు ఆర్మీ నియామక ర్యాలీ జరుగుతుందని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్‌టెక్నికల్, ట్రేడ్‌మెన్ కేటగిరీల కోసం జరగనున్న ర్యాలీకి పక్కా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతోనిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ర్యాలీ ఈనెల 25వ తేదీ అర్ధరాత్రి ప్రారంభంకానున్న ర్యాలీలో 13 జిల్లాలకు చెందిన యువత పాల్గొంటారన్నారు. స్టేడియం వద్ద తాగునీరు, లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, మొబైల్ టాయిలెట్లు, డస్టబిన్లు ఏర్పాటుచేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు వేచి ఉండేందుకు మూడు హాళ్లు, వైద్య శిబిరాలు, రిజిస్ట్రేషన్ కౌంటర్లుకు ఆరు హాళ్లు, అవసరమైన ఫర్నిచర్, ఫ్యాన్లు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు, బారికేడ్లు, ట్రాక్‌లు, ఎన్‌క్లోజర్లు, ర్యాలీకి అవసరమైన స్టాండ్లు సమకూర్చాలని రోడ్లు భవనాల అధికారులకు ఆదేశించారు. వైద్యబృందాలు, అంబులెన్స్‌లు, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరిజ్ఞానం ఉన్న టీచర్లు, కోచ్‌లు, అగ్నిమాపక యంత్రాలు, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు, అల్పాహారం, భోజనం ఏర్పాటుచేయాలన్నారు.

29, 31 తేదీల్లో భగత్‌కి కోఠి ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 19: వెస్ట్ సెంట్రల్ రైల్వే పరిధిలోని జబల్‌పూర్ డివిజన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ నిర్మాణ పనులు చేపడుతు న్నందున ఈనెల 29న విశాఖ నుంచి భగత్‌కి కోఠి వెళ్లే 18573 నంబరు గల ఎక్స్‌ప్రెస్, అలాగే తిరుగు ప్రయాణంలో భగత్ కి కోఠి నుంచి విశాఖ వచ్చే 18574 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. ప్రయాణికులు గమనించాలని సూచించారు.

ఆలస్యంగా ఆర్టీసీ బస్సులు



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19: అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ సోమవారం ప్రయాణికులతో రద్దీగా మారింది. అయితే సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. శుభకార్యాలు, రాఖీ పండగ సందర్భంగా పట్టణానికి వచ్చి పోయే గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులతో పాటు పట్టణం నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని బంధువులు, కుటుంబసభ్యులను కలిసేందుకు వెళ్లే ప్రయాణికులతో పాసింజర్ బస్సులు నిలిపే ప్లాట్‌ఫారం రద్దీగా కనిపించింది. ముఖ్యంగా విజయనగరం, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం ప్రాంతాల వైపు వెళ్లే బస్సులు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. ఈ విషయమై డిపో అధికారులను వివరణ కోరగా డిపోలోని అన్ని బస్సులు, అన్ని రూట్‌ల్లో నడుస్తున్నాయని తెలిపారు. అయితే సోమవారం రద్దీ పెరిగిందని అందుకు అనుగుణంగా అవసరమైన మార్గాల్లో ప్రయాణికులకు బస్సులను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టామని వివరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

గిరిజన ఉత్పత్తులకు పబ్లిసిటీ

- దళారుల నుంచి కొంటే కఠిన చర్యలు
- అవుట్ సోర్సింగ్ ద్వారా ఖాళీల భర్తీ
- గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



ఉద్యోగులతో సమీక్షిస్తున్న గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ ఉత్పత్తులకు ప్రజాదరణ ఆదరణ ఉందని, సరైన ప్రచారం లేక అమ్మకాలు పెరగడం లేదని గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అసంతృప్తి వ్యక్తంచేశారు. బీచ్ రోడ్డులోని జీసీసీ భవన్‌లో సోమవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎండీ కల్పనాకుమారి జీసీసీ కార్యకలాపాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజనుల నుంచి సేకరించిన చింతపండు, కాఫీ, పసుపు, తేనె తదితర ఉత్పత్తులకు సరైన బ్రాండింగ్ లేకపోవడం, రిటైల్ మార్కెటింగ్ చేయకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగడం లేదన్నారు. అటవీ ఉత్పత్తులకు జీసీసీ ఇచ్చే ధరలను అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. దళారుల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జీసీసీలో సిబ్బంది కొరత ఉన్నందున అవుట్ సోర్సింగ్ విధానంలో అర్హత కలిగిన గిరిజన యువతకు అవకాశం కల్పించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న జీసీసీ భవనాన్ని పీపీపీ విధానంలో పునర్నిర్మిస్తే ఆదాయం సమకూరుతుందన్నారు. కాఫీ మార్కెటింగ్‌కు తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడినా, సంస్థ నిధులను సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకున్నా చర్యలు తప్పవన్నారు.

భోగాపురంలో ఆగని మరణాలు

- కిడ్నీ వ్యాధితో మరొకరి మృతి
- పదేళ్లలో 16 మంది మృత్యువాత
- అధిక సంఖ్యలో బాధితులు
- తాగునీటి వల్లే వ్యాధి బారిన పడుతున్నారని తెలిసినా పట్టించుకోని అధికారులు



కిడ్నీ వ్యాధితో మృతి చెందిన నాగేశ్వరరావు (ఫైల్)

అచ్యుతాపురం, ఆగస్టు 19: మండలంలోని భోగాపురంలో మరో కిడ్నీ వ్యాధిగ్రస్థుడు సోమవారం మృతి చెందాడు. దీంతో పదేళ్లలో మృతుల సంఖ్య 16కు చేరింది. ఇంకా అనేక మంది వ్యాధి పీడితులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. తాగునీరులో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉందని, దీని వల్లే కిడ్నీ సంబంధిత వ్యాధి వస్తున్నదని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

భోగాపురంలో కిడ్నీ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ సమస్యపై గత నెల 20న 'అయ్యో పాపం భోగాపురం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు గ్రామాన్ని సందర్శించి హడావిడి చేశారు. గ్రామంలో 12 బోర్లున్నాయని, అందులో కొన్ని బోర్ల నీటిలో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉందని భావిస్తున్నామని చెప్పారు. నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతున్నామని, కలెక్టర్‌తో చర్చించి భోగాపురంలో ఆర్వో ప్లాంటు ప్రారంభిస్తామని చెప్పి వెళ్లిపోయారు. అయితే నీటి నమూనాలు సేకరించి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు రిపోర్టులు కూడా రాలేదు. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సోమవారం కిడ్నీ వ్యాధితో మృతి చెందిన కూండ్రపు నాగేశ్వరరావు ఎనిమిది సంవత్సరాలుగా ఈ వ్యాధితో బాధపడుతున్నాడు. గ్రామంలో నీటి వల్ల కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని తెలిసి ఆయన గ్రామాన్ని వదిలి జంగులూరు జంక్షన్‌కి కాపురం మార్చాడు.

పది రోజుల క్రితం విశాఖలోని ఓ ఆస్పత్రిలో అతనికి కిడ్నీ మార్పిడి కూడా చేశారు. కానీ సోమవారం మృతి చెందాడు. ఇంకా గ్రామంలో చాలా మంది కిడ్నీ వ్యాధిగ్రస్థులు ఉన్నారు. సోమవారం మరో ఇద్దరు డయాలసిస్‌కి విశాఖ వెళ్లారు. గ్రామంలో పరిస్థితి దారుణంగా ఉన్నా ఇంత వరకు కనీసం వైద్య శిబిరం కూడా నిర్వహించకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖా ధికారులు స్పందించి మరింత మంది ఈ వ్యాధి బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

- కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందుతున్న అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శంకరంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదీల నుంచి అర్జీలను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడారు. అనంతరం అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అర్జీల పరిష్కార విషయంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించరాదన్నారు. నిర్దిత కాల వ్యవధిలో అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమానికి 143 అర్జీలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, డిప్యూటీ కలెక్టర్ రమామణి, అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదీతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

ఫిర్యాదుల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు

- దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు

తుమ్మపాల, ఆగస్టు 19 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్టు దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేరుగా ఫిర్యాదీల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి 25 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీ డీఎస్పీ బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ విజయకృష్ణన్



వైద్యాధికారులను అభినందిస్తున్నజిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, ఆగస్టు 19: ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిని సారించాలని, అందుకు అనుగుణంగా వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖకు జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలకు సంబంధించి ఎన్టీఆర్ వైద్యాలయం మూడు సర్టిఫికెట్లు సాధించడం ఆనందదాయకమన్నారు. అలాగే 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏడు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లకు అభినందనలు తెలియజేశారు. ఆస్పత్రులకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని, వైద్య ప్రమాణాలను పాటించడంలో వైద్య సిబ్బంది మరింత జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శిశువుల విక్రయ ముఠా అరెస్టు

- ఆరుగురు చిన్నారులను రక్షించిన పోలీసులు
- విశాఖ సీపీ శంఖబ్రతబాగ్చి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఢిల్లీ రాష్ట్రాల్లో చిన్నారులను విక్రయిస్తున్న అంతర్‌రాష్ట్ర ముఠా గుట్టును నగర పోలీసులు రట్టు చేశారు. రెండు వేర్వేరు కేసుల్లో 17 మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి ఆరుగురు చిన్నారులను రక్షించారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ శంఖబ్రతబాగ్చి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పాండురంగాపురంలోని హార్బర్ పార్క్ వద్ద ఐదు నెలల ఆడ శిశువును విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న తొమ్మిది మందిని పోలీసులు ఈనెల 11న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను పోలీసులు విచారించగా మరికొంత సమాచారం లభించింది. దాని ఆధారంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో సీపీ డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. శిశువును విక్రయించే ముఠాతో సంబంధాలు కలిగిన గాజువాకలోని శ్రీనగర్‌కు చెందిన బొడ్డేడ మల్లికార్జున్‌ను పిల్లలను కొనేందుకు ఆసక్తి ఉన్నవారిలా పోలీసులే సంప్రతించారు. రెండు, మూడు చోట్లకు రావాలని చెప్పినా, పోలీసులేమోననే అనుమానంతో మల్లిఖార్జున్ వారిని కలవలేదు. తర్వాత నిజంగా శిశువు కోసం తిరుగుతున్నారని నమ్మకం కుదరడంతో 15 నెలల వయస్సు కలిగిన ఆడశిశువును తీసుకుని రాగా, పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత అతడిని విచారించగా కడపకు చెందిన ఇద్దరు, ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తి, మరికొందరు కలిసి ఏపీతోపాటు తెలంగాణ, ఒడిశా, ఢిల్లీల్లో పిల్లలను విక్రయిస్తున్నట్టు తేలింది. దీంతో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి అనకాపల్లి జిల్లా మార్టూరులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పది నెలల బాబును, చీమలాపల్లిలో మూడేళ్ల వయస్సుగల బాలికను, పెదనరవలో 20 రోజుల పాపతోపాటు ఒడిశాలోని జైపూర్‌లో తొమ్మిది నెలల బాబును, మరో ఇద్దరినీ పోలీసులు రక్షించారు. విక్రయాల ముఠాతో సంబంధం కలిగిన ఎనిమిది మందిని గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. వివాహేతర సంబంధాల కారణంగా గర్భందాల్చినవారు అబార్షన్ చేసే పరిస్థితి లేనప్పుడు తప్పనిసరిగా ప్రసవించాల్సి ఉంటుంది. అలాంటి వారిని ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులు, ఇతర సిబ్బంది గుర్తించి డబ్బులు ఇస్తామని ఆశ చూపించి పిల్లలను విక్రయించేలా సిద్ధం చేస్తుంటారు. అలాగే పుట్టుకతోనే అనారోగ్యం కలిగిన పిల్లలను విక్రయించేలా తల్లిదండ్రులను ఆస్పత్రులు, నర్సింగ్‌హోమ్‌లలో పనిచేసే సిబ్బంది ప్రోత్సహిస్తున్నారు. వీరితోపాటు ఆర్థిక ఇబ్బందులు కలిగినవారు పిల్లలను విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు. అలాంటి వారిని గుర్తించిన వారంతా పిల్లలను కొనేందుకు ఆసక్తి చూపేవారి గురించి తెలిసినవారితో పరిచయాలు ఏర్పరచుకుని ముఠాగా తయారవుతున్నారు. ఒక్కో శిశువును రూ.ఐదు నుంచి రూ.ఏడు లక్షలకు విక్రయిస్తున్నట్టు పోలీసుల విచారణలో గుర్తించారు. ఈ ముఠా మూలాలు మరికొన్ని రాష్ట్రాలకు విస్తరించినందున అక్కడకు ప్రత్యేక బృందాలను పంపించి దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు సీపీ తెలిపారు. త్వరలోనే మరికొందరు శిశువులను ముఠా చేతుల్లో నుంచి రక్షించడంతోపాటు మరికొందరు నిందితులను అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. నగరంలో ప్రసవాలు జరిగే 80 ఆస్పత్రులు, నర్సింగ్‌హోమ్‌లలో భద్రతా లోపాలు ఉన్నట్టు గుర్తించామని, ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు జాబితా పంపించామన్నారు. తాము కూడా ఒక్కో ఆస్పత్రికి నోటీసులు జారీచేసి భద్రతాపరమైన లోపాలను సరిదిద్దుకోవాలని ఆదేశించామన్నారు.

ఏషియన్ పెయింట్స్‌లో అప్రెంటీస్ కోసం ఇంటర్వ్యూలు

అచ్యుతాపురం, ఆగస్టు 19: ఏషియన్ పెయింట్స్‌లో అప్రెంటీస్ కోసం ఈ నెల 26న ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామని కర్మాగారం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురంలో గల ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం పది నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానికల్, డిప్లొమా మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్‌లో 2022-24 మధ్య పాసైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాల కోసం 99595 90601 ఫోన్ నంబర్‌ను సంప్రతించాలని పేర్కొన్నారు.

శ్రమకు మించిన ప్రత్యామ్నాయం లేదు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరిని సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, ఆగస్టు 19: వృత్తిపరమైన సమగ్రతను కాపాడుకోవడానికి శ్రమను మించిన ప్రత్యామ్నాయం లేదని డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ చాన్సలర్, సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి తెలిపారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్ చైర్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి 'నావిగేషన్ లా స్కూల్ అండ్ లీగల్ ప్రొఫెషన్' అనే అంశంపై ప్రసంగిస్తూ- న్యాయ వ్యవస్థలు గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. న్యాయవాదులు, న్యాయ నిపుణులను రూపొందించడం ద్వారా మార్పు కోసం ఈ కార్యక్రమాన్ని ఉపన్యాసం కంటే లైవ్ ఇంటరాక్షన్, అనుభవాన్ని పంచుకునే సెషన్‌గా పరిగణించాలన్నారు. డిఫెన్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంలో విఫలమైనప్పటికీ 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఎదిగిన డాక్టర్ అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు నిరుత్సాహపడకుండా ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఆయన డీఎస్ఎన్ఎల్‌యూ మధ్యవర్తిత్వ పోటీకి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తి మహేశ్వరిని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, డాక్టర్ దయానందమూర్తి, అకడమిక్ డైరెక్టర్ సోమాభట్టాచార్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సమాచారాన్ని దరఖాస్తుదారునికి అందజేయాలి'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19: ఆర్‌టీఐ పరిధిలో ఉన్న సమాచారాన్ని దరఖాస్తుదారునికి తక్షణమే అందజేయాలని రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశించింది. టీటీడీకి సమాచారం కోసం దరఖాస్తు చేసిన 12 ఏళ్లకు ఆర్‌టీఐ కమిషన్‌లో సోమవారం అపీల్ విచారణకు వచ్చింది. టీటీడీలో ఆర్‌టీఐ చట్టం అమలుపై సమీక్ష చేసి తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సమాచార కమిషన్ స్పష్టం చేసిందని ఆర్‌టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. సోమవారం కమిషన్ సునీల్ వర్చువల్ విధానంలో విచారణ చేశారన్నారు. టీటీడీలో జరిగే కార్యక్రమాలపై 2012 నవంబరు 11వ తేదీన సమాచారం కోసం దరఖాస్తు చేశానని తెలిపారు. ఎటువంటి స్పందన లభించకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించానన్నారు. దీనిపై జరిగిన విచారణలో దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని ఇవ్వాలని కమిషన్ స్పష్టం చేసినట్టు తెలిపారు.

'వికసిత్ ఏపీ' లక్ష్యం

- కలెక్టర్ దినేశ్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 'వికసిత్ ఆంధ్ర- 2047' పేరిట అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అందుకు అనుగుణంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. 2029 నాటికి జిల్లాలోని వివిధ రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించేందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రధానంగా వ్యవసాయం, ఉద్యానవన, పశు సంవర్థక, మత్స్యశాఖ, పారిశ్రామిక, విద్య, వైద్యం, సేవా, పర్యాటక రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను ఈనెలాఖరు నాటికి సమర్పించాలన్నారు. స్థూల ఆర్థికాభివృద్ధి పెరిగేందుకు అవకాశమున్న రంగాలను ప్రాధాన్యతా పరిగణించి ఆయా ప్రణాళికలు రూపొందించాలని, అవన్నీ దేశ ప్రధాని మోదీ ప్రకటించిన 'వికసిత్ భారత్- 2027', సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొనే 'వికసిత్ ఆంధ్ర- 2047' లక్ష్యాలను చేరుకునేందుకు అనువుగా ఉండాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎస్ఎన్ఆర్‌కే.పట్నాయిక్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు, ఆస్పత్రుల జిల్లా సమన్వయకర్త కె.కృష్ణారావు, జిల్లా పరిశ్రమల అధికారి వాణిధర్, పర్యాటకాధికారి దాసు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా



రికవరీ చేసిన మొబైల్‌ను అందజేస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

తుమ్మపాల, ఆగస్టు 19: అనకాపల్లి శంకరం వద్ద గల ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏడవ విడత మొబైల్ రికవరీ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు బాధితులకు రూ.32 లక్షల విలువ చేసే 284 సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి నుంచి 3,300 ఫిర్యాదులు అందగా ఏడు విడతలల్లో 1930 పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీ డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణరావు, అప్పలనాయుడు, ఐటీ కోర్ ఎస్ఐ రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.